క్లుప్తంగా

వైభవంగా కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ



దేచెర్లలో కోదండ రామాలయంలో పూజలో పాలొన్న తలారి వెంకట్రావు తదితరులు

కొవ్వూరు: కోదండ రామాలయంలో వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, ఆంజనేయస్వామి వార్ల నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గణపతి పూజ, శాంతి హోమం నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు. వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు, పార్టీ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, ఉప్పులూరి వెంకట ఫణికృష్ణా రావు(నానాజీ), సర్పంచ్ గోశాల నాగర్జున, కంచుమర్తి బాలశంకరం పంతులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మజ్జిగ, ఫ్రూట్ జ్యూస్ పంపిణీ



ముక్కామలలో చలివేంద్రాన్ని ప్రారంభించిన యువకులు

పెరవలి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు యువకులంతా కలసికట్టుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులు, గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేసామని ముక్కామలకు చెందిన 'ఐ లవ్ ముక్కామల' పేరిట దీనిని ప్రారంభించామన్నారు. ఈ చలివేంద్రంలో మజ్జిగతో పాటు ఫ్రూట్ జ్యూస్ అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసిన యువకులను సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, వేంద్ర శ్రీనివాస్ అభినందించారు.

ఉపవాస దీక్షల ముగింపు

గోపాలపురం: క్రైస్తవ విశ్వాసులు 40 రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిసాయి. గోపాలపురం మండలం భీమోలు లూథరన్ చర్చి ఫాదర్ కె శ్యామ్యూల్ అధ్యక్షతన దీక్ష విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత దంపతులు దీక్షాధారులు, విశ్వాసులకు లూథరన్ చర్చి వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్, కాకులపాటి వీరేష్, వీర్లగడ్డ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నల్లజర్ల సమితి యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్‌రాజు వెల్లడించారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షులుగా యూవీవీయన్ ఆంజనేయబాబు, ఉపాధ్యక్షులుగా మడిచర్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.యోహాను, అదనపు కార్యదర్శిగా పి.సావిత్రి, ట్రెజరర్‌గా ఆర్‌వీ రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా ముళ్ళపూడి నాగవెంకట సతీష్, మరో జిల్లా కౌన్సిలర్‌గా ఆర్‌ఎల్‌ఎ సుజాత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు సంఘ జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్‌రాజు, జిల్లా ట్రెజరర్ కె.ప్రసన్న ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

120 మందికి వైద్య పరీక్షలు

నల్లజర్ల: దూబచర్ల లయన్స్ క్లబ్, పార్ద్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వైద్య బృందం దాదాపు 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 15 మందికి అదనపు పరీక్షలు అవసరమని వీరందర్ని హెల్ప్ హాస్పటల్‌కు రిఫర్ చేసినట్టు డాక్టర్ కిరణ్ తెలిపారు. డాక్టరు కిరణ్ మాట్లాడుతూ ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, తల తిరగడం, గుండె నొప్పిగా ఉండటం ఎడమ చేయి లాగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లావాసు, పార్ద్ ఇండియా నల్లజర్ల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, క్యాంపు కన్వీనర్ అంబటి శ్రీనివాసరావు, తాతిన సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కరావు, మైనం వెంకటేశ్వరావు, యోగమిత్ర రాజారావు, కూరపాటి నాగరాజు, బొందల శ్రీనివాసరావు, చీమకుర్తి కృష్ణ ప్రసాద్, నెక్కంటి వెంకటేష్ పాల్గొన్నారు.



అన్నవరప్పాడు సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్, సర్వీస్ రోడ్లు లేని ప్రమాదకరమైన కూడలి



ఖండవల్లి సెంటర్‌లో సర్వీస్ రోడ్లు లేని కూడలి



నల్లాకులవారిపాలెం వద్ద ప్రమాదకర కూడలి



పెరవలి వద్ద అత్యంత ప్రమాదకరమైన కూడలి

మృత్యు కూడళ్లు



ఖండవల్లి వద్ద ప్రమాదానికి గురై నుజ్జునుజ్జయిన ఆటో (ఫైల్)

- నిబంధనలు పాటించని ఎన్‌హెచ్ అధికారులు
- దశాబ్దాలు గడుస్తున్నా సెంట్రల్ లైటింగ్ లేదు
- ప్రమాదాల బారిన బాటసారులు, వాహనచోదకులు
- గ్రామాల వద్ద ఏర్పాటు చేయని సర్వీస్ రోడ్లు

పెరవలి: మృత్యుకుహారాల్లా జాతీయ రహదారిని ఆనుకుని ఉండే గ్రామ కూడళ్లు తయారయ్యాయి. ప్రమాదాలకు నెలవుగా మారిన ఈ కూడళ్ల వద్ద వాహనదారులు, పాదచారులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ప్రధాన రహదారులు జాతీయ రహదారికి అనుసంధానమైన చోట ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి.

పెరవలి మండలంలో ప్రమాద ఘంటికలు

పెరవలి మండలంలో 15 కిలోమీటర్లు విస్తరించిన జాతీయ రహదారిపై పెరవలి, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల వద్ద ఏర్పాటుచేసిన కూడళ్లు మృత్యు మార్గాలుగా మారాయి. ముఖ్యంగా రోడ్డు క్రాస్‌ల వద్ద రహదారులు మలుపులు ఉండటం వల్ల రెండవ వైపు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు ఉదయం సాయంత్రం సమయాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ సమయాల్లో పొలాలకు వెళ్లే రైతులు, దూరప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉండటం, హడావుడిగా రోడ్డు దాటే సమయంలోనే వేగంగా వచ్చే వాహనాలకు బలవుతున్నారు. జాతీయ రహదారి ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ గ్రామ కూడళ్ల వద్ద ఎన్‌హెచ్ అధికారులు స్టాపర్లు, హెచ్చరిక బోర్డులు, సెంట్రల్ లైటింగ్ నేటికీ ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆరుచోట్ల ప్రమాదకర కూడళ్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ రహదారి 100 కిలో మీటర్ల మేర విస్తరించి ఉండగా ఎక్కువగా ప్రమాదాలు పెరవలి మండలంలోనే నమోదవుతున్నాయి. 2016లో జాతీయ రహదారిపై ఎక్కడెక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి, కారణాలు తెలుసుకునేందుకు ఓ కమిటీని నియమిస్తే వారు సర్వే చేసి జిల్లాలో 16 చోట్ల అత్యంత ప్రమాదకరమైన కూడళ్లను గుర్తించారు. ఇందులో 6 కూడళ్లు ఒక్క పెరవలి మండలంలోనే ఉన్నాయని తెలియడంతో అధికారులు అప్పట్లో తాత్కాలిక చర్యలు తీసుకుని వదలి వేసారు. అప్పట్లో గ్రామ కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా నేటికీ అమలు కాలేదు.

మూడేళ్లలో నమోదైన ప్రమాదాలు

పెరవలి మండలంలో జాతీయ రహదారిపై మూడేళ్ల కాలంలో 365 ప్రమాదాలు నమోదయ్యాయి. ఇందులో 230 మంది క్షతగాత్రులు కాగా 102 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాలన్నీ కూడా గ్రామ కూడళ్ల వద్దే జరగడం గమనార్హం. 2021-22లో 41 మంది, 2022-23లో 43 మంది, 2023-24 నుంచి ఇప్పటి వరకు 23 మంది జాతీయ రహదారిపై పెరవలి మండలంలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందారు. ఈ వివరాలు పోలీస్ రికార్డుల్లో నమోదైనవి కాగా రికార్డుల్లో నమోదు కానివి, రాజీ పడినవి ఎన్నో ఉన్నాయి.

2015లో డీజీపీగా పనిచేసిన సాంబశివరావు తూర్పుగోదావరి నుంచి తాడేపల్లి వెళుతుండగా ఖండవల్లి వద్ద ఓ ప్రమాదం జరిగితే తానే స్వయంగా కారు దిగి క్షతగాత్రులను తన కారులోనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు అప్పట్లో ఆయనకు విన్నవించారు.

నిబంధనలను పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామ కూడళ్ల వద్ద డివైడర్లను (రోడ్డు క్రాసింగ్‌లు) ఏర్పాటు చేసినప్పుడు గ్రామం నుంచి వచ్చే రహదారులకు స్పీడు బేకర్లు నిర్మించాల్సి ఉన్నా ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. ఈ డివైడర్ల వద్ద పాదచారులు, వాహనచోదకుల కోసం జీబ్రా గుర్తులను వేయలేదు. ఈ గుర్తులు ఉన్నప్పుడు వాహనదారులు గ్రామ కూడలిగా గుర్తించి వేగాన్ని తగ్గించి ప్రయాణిస్తుంటారు. డివైడర్ల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిపే బొమ్మలు ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగాన్ని తగ్గించడానికి స్పీడు కంట్రోలు స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయలేదు. కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా ఐరన మెస్‌లు ఏర్పాటు చేయలేదు. ఈ గ్రామ కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయలేదు. అందువలనే గ్రామ కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

క్రికెట్ టోర్నమెంటు విజేతగా తరుణ్ జట్టు



కొవ్వూరులో విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కంఠమణి రమేష్ బాబు, ముదునూరి నాగరాజు

కొవ్వూరు: క్రీడాపోటీలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడగాయని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్ అన్నారు. పట్టణంలో ఎన్‌టీఆర్ క్రీడాప్రాంగణంలో మూడు రోజుల నుంచి రాజు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజు ఫోర్ లైన్ క్రికెట్ టోర్నమెంటు ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంటులో వివిధ ప్రాంతాలకు చెందిన 15 టీములు పాల్గొన్నాయి. కొవ్వూరు తరుణ్ జట్టు ఫైనల్ పోటీలో విజేతగా నిలిచింది. వేములూరు ధన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కంఠమణి రమేష్ బాబు, నాయకులు ముదునూరి నాగరాజు చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీని అందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన జట్టుకి రూ.12వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.8 వేలు,తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకి రూ.5వేలు చొప్పున నగదు పారితోషికం రమేష్‌బాబు,నాగరాజు ఆర్థికసాయంతో అందించినట్టు నిర్వాహకులు తెలిపారు.

పార్టీలో క్రమశిక్షణతో పని చేయాలి

మాజీ మంత్రి తానేటి వనిత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: పార్టీ శ్రేణులు క్రమ శిక్షణతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పని చేయాలని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. స్థానిక కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద ఆదివారం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు గ్రామ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వనిత మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేయాలని, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీకి తగిన గుర్తింపు వచ్చే విధంగా పని చేయాలన్నారు. ఈ నెల 26వ తేదీన అనుబంధ విభాగాలు, గ్రామ కమిటీ అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం నిర్వహిస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, మాజీ రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సాలి వేణు, వింత ప్రసాద్‌రెడ్డి, ఎస్‌కే వల్లీ, కాకులపాటి శ్రీనివాస్, చాపల రమేష్, ఎస్‌కే నబీ పార్టీ అనుబంధ, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

లంకల్లో కొనసాగుతున్న మట్టి అక్రమ రవాణా



మట్టి తవ్వకాలకు వినియోగించే భారీ యంత్రం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని గోదావరి లంకల్లో అక్రమంగా మట్టి రవాణా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే పొట్టిలంక శివార్లలో మట్టి అక్రమ తవ్వకాలు కడియం మండలం పరిధిలోనిది కాదని రెవెన్యూ అధికారులు చేతులు దులిపేసుకున్నారు. దీనిని అవకాశంగా మలచుకున్న అక్రమ తవ్వకందారులు ప్రస్తుతం కడియపులంక- బుర్రిలంక మధ్యనున్న గోదావరి లంకల్లో నుంచి మట్టిని తవ్వి బైటకు తరలిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇందు కోసం భారీ యంత్రాలను లంకల్లోనే ఉంచుతున్నారంటున్నారు. అధికారులు కనీసం ఆ వైపునకు కూడా కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు పాటించకుండా ఇలా అక్రమార్కులు లంక మట్టిని తవ్వేస్తుండడం పట్ల స్థానిక రైతుల్లో ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు జూన్‌లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగుల డిమాండ్ల సాధనకు ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జూన్ నెలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ తెలిపారు. స్థానిక జైలు రోడ్డులోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఏపీజీఈఏ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభను ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సీనియర్ నాయకులు కేఆర్ సూర్యనారాయణ నేతృత్వంలో నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 12న సంఘం రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. న్యాయస్థానం జడ్జి అధ్యక్షతన పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, తాత్కాలిక భృతి ప్రకటించి ఉద్యోగులకు భరోసా కల్పించాలన్నారు. జిల్లా సహ అధ్యక్షుడు చంబర్లీన్, ఉపాధ్యక్షులు కే.వెంకటేశ్వరరావు, పి.రవి కుమార్, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉదయ్‌కుమార్ కుటుంబానికి పరామర్శ



ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: పేరుపాలెం బీచ్‌లో శనివారం ఉదయం స్నానానికి వెళ్లి మృతి చెందిన సంకెళ్ల ఉదయకుమార్ కుటుంబ సభ్యులను హోం శాఖ మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ తానేటి వనిత పరామర్శించారు. ప్రమాద ఘటన ఏ విధంగా జరిగిందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నాయకులు ఉన్నారు.

కమ్యూనిస్టు నేత మొల్లేటి మృతి

పెరవలి: కమ్యూనిస్టు నాయకుడు, ఎమర్జెన్సీ ఉద్యమంలో పాల్గొన్న మొల్లేటి చిన్న వెంకటరెడ్డి (93) ఆదివారం అకాల మృతి చెందారు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన మొల్లేటి చిన్న వెంకటరెడ్డికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రస్తుతం కుమారులు వివిధ పార్టీల్లో కీలక పదవుల్లో ఉన్నారు. వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని కమ్యూనిస్టు నేత సైపురెడ్డి గంగాధర్, పంత నాగేశ్వరరావు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి చేయూతనివ్వాలి

నిడదవోలు: స్థానిక యర్నగూడెం రోడ్డులో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం వెల్డింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వెల్డింగ్ కార్మికుల సంఘ అధ్యక్షుడు తీపర్తి వీర్రాజు మాట్లాడుతూ వెల్డింగ్ కార్మికులంతా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా కార్మికులు వివిధ ఆర్థిక ప్రయోజనాలకు అర్హత పొందుతారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఆరేళ్ల నుంచి కార్మికశాఖ నుంచి ఏవిధమైన ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు తక్షణమే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముల్లా వంశీ, అంగర వీర బాబు , క్రొవ్విడి సూర్యనారాయణ, భద్రం పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్‌లో పదవులు



పదవులు ప్రకటిస్తున్న ఉత్తరాంధ్ర గోరక్షక్ ప్రముఖ్ సుబ్బారాయుడు

నల్లజర్ల: మండలంలోని విశ్వహిందూ పరిషత్ సభ్యులను ఆదివారం ప్రకటించారు. అందులో విశేష సంవర్క్‌గా మన్నే వేణుప్రసాద్, మండల సహాయ కార్యదర్శిగా పాము శ్రీను, మండల భజరంగ్‌దళ్ అధ్యక్షుడిగా శ్రీపాదసాయి ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా వీరమళ్ల అజయ్, సమరసత ప్రముఖునిగా నందమూరి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ విషయాలను ఉత్తరాంధ్ర విశ్వహిందూ పరిషత్ గోరక్షక్ ప్రముఖ్ సుబ్బారాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కందుల రవి, ముత్యాల గంగాధర్, సవలం రామకృష్ణ, మాయలేడి తాతారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసెట్ ఉచిత తరగతులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఐసెట్ ఉచిత కోచింగ్ తరగతులు ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆదివారం తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, వారికి ఉత్తమ శిక్షణ అందించేందుకు ఈ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కోచింగ్ తరగతులు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కోచింగ్ తరగతులు నిపుణులైన అధ్యాపకుల ద్వారా నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



వేగేశ్వరపురంలో ఈస్టర్ సందర్భంగా సమాధులను పూలతో అలంకరించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



సమిశ్రగూడెం సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు



నిడదవోలు చర్చిపేటలో సమాధుల తోటలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పూర్వీకుల సమాధులకు పూలు, కొవ్వొత్తులతో అలంకరణ

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రభువు పునరుత్థానం (ఈస్టర్) పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేగేశ్వరపురం, పైడిమెట్ట, ప్రక్కిలంక, మలకపల్లి, పెద్దేవం, గజ్జరం, అన్నదేవరపేట తదితర గ్రామాల్లోని సమాధులను తెల్లవారుజామున శుభ్రం చేసి రంగులు వేసి పూలతో అలంకరించారు. వేగేశ్వరపురంలోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి సమీపంలోని సమాధులకు పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా బొలుపు విజయ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అక్కడకు ప్రార్థనలకు వచ్చిన వారికి అల్పాహారం అందజేసారు. స్థానిక గోదావరి మేరిమాత పుణ్యక్షేత్రం వద్ద ఈస్టర్‌ను డైరెక్టర్ టి జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. ప్రక్కిలంక చర్చిలో, పైడిమెట్ట ఏపీఫానియా లూథరన్ చర్చి వద్ద, మలకపల్లి చర్చిలో అపోస్తలుడు సీహెచ్ఎస్ స్వర్ణన్‌బాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు.

సమిశ్రగూడెం సమాధుల వద్ద..

నిడదవోలు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమాధులను రంగులతో, పూలతో అలంకరించారు. ప్రార్థన మందిరాల్లో క్రీస్తు పునరుత్థానమైన విశిష్టతపై దైవజనులు వాక్యోపదేశాలు చేశారు. సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, కలవచర్ల, రావిమెట్ల, తాడిమళ్ల గ్రామాల్లోని ప్రధాన మందిరాల్లో విశ్వాసులు ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు.

గోపాలపురం మండలంలో..

గోపాలపురం: క్రైస్తవ విశ్వాసానికి ఆధారం పునరుత్థానమని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవ ఫాదర్ తిగిరిపల్లి గాబ్రియేలు అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం పెద్దగూడెం సమాధుల వద్ద ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. గోపాలపురం మండలంలోని చిట్యాల, వేళ్ల చింతలగూడెం, దొండపూడి, కరిచర్లగూడెం, సాగిపాడు, సగ్గొండ, జగన్నాథపురం తదితర గ్రామాల్లోని చర్చిల వద్ద, వారి బంధువులు సమాధుల వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టి ప్రార్థనలు నిర్వహించారు.

ఉండ్రాజవరంలో ప్రార్థనలు

ఉండ్రాజవరం: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా నిర్వహించే ఈస్టర్ పండుగను ఆదివారం మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవుల తమ పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులను వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు గ్రామాల్లో చర్చిల్లో సామూహిక ప్రార్థనల అనంతరం గ్రామాల్లో సువార్త ర్యాలీలు నిర్వహించారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

చాగల్లు: క్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవ సోదరులు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌరిపల్లి క్రీస్తు కల్వరి ప్రేమ ప్రార్థన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ కాపరి యు ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమని అన్నారు. బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాస్టర్ సల్మన్‌రాజు ఏసుక్రీస్తు వాఖ్యాన్ని విశ్వాసులకు వివరించారు. మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు

నిడదవోలు: నియోజకవర్గంలో క్రైస్తవ ఆలయాల్లో ఆదివారం ఈస్టరు (సమాధుల పండుగ) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని చర్చిపేటలో క్రైస్తవ సమాధుల తోటలో క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధుల వద్దకు ఆదివారం తెల్లవారుజామున తరలివచ్చి పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. రాయిపేటలో మెంటె సుందరరావు మెమోరియల్ సెయింట్ జాన్స్ లూథరన్ టౌన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఏసు అనుచరుల మినిస్ట్రీ స్పీకర్ పి. భక్తసింగ్ ప్రసంగించారు. చర్చి చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి సంఘంలోని పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవ. కె. కమలాకర్, డి. విజయకుమార్, సుజ్ఞానరావు పాల్గొన్నారు. చర్చిపేటలో కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన కెనడియన్ బాప్టిస్టు మిషన్ స్పీకర్ సీపీ రాజు వాక్య సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవ. బయ్యె ఆనంద్‌కుమార్, సహాయక పాస్టర్ విపర్తి శాంతిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కేథలిక్ షెయింట్ జాన్స్ ప్యారిస్ చర్చి, ఆర్‌సీఎం, బెత్లెహేము ప్రార్థనా మందిరం, జీడియం, న్యూ స్పిరిట్ చర్చి, జీవంగల దేవుని సంఘం, సియోను ప్రార్థనా మందిరం, మరనాత ప్రార్థనా మందిరాల్లో ఈస్టరు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.